


26 నుండి 29 వరకు అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దేవరపల్లి ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రస్థాయిలో అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 26వ తేదీ నుండి 29 వరకు ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 2500 మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు మన ఏలూరులో జరగడం మన జిల్లాకు గర్వకారణమని తెలిపారు. ఛాంపియన్‌షిప్ పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని తరగతుల ప్రజలు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అమ్మకానికి వైద్య విద్య..!


ఏలూరు సర్వజన ఆసుపత్రిలో కొనసాగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణం

- పిపిపి విధానంలో పాలకొల్లు మెడికల్ కాలేజీ నిర్మాణం
- ప్రభుత్వ సొమ్ముతో కట్టి ప్రయివేటుకు ధారాదత్తం
- 50 శాతానికిపైగా వైద్య సీట్లు సొమ్ము పెట్టి కొనాల్సిందే
- రూ.లక్షలు వెచ్చించలేక వైద్య విద్యకు దూరం కానున్న పేద, మధ్యతరగతి విద్యార్థులు
- ఇప్పటికే ఏలూరు మెడికల్ కాలేజీలో సీట్లు అమ్మకం
- ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైద్య విద్యను సామాన్యులకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుంది. గతంలో వైసిపి కంటే దారుణంగా వైద్యవిద్యను పూర్తిగా అమ్మకానికి పెట్టేసింది. పిపిపి (పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్) విధానంలో మెడికల్ కాలేజీ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ సొమ్ముతో మెడికల్ కాలేజీలు నిర్మించి ప్రయివేటుకు దానం చేసేందుకు సిద్ధమైంది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం దగ్గులూరులో నిర్మించే మెడికల్ కాలేజీని పిపిపి విధానంలో నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో దీనికి ఆమోద ముద్ర సైతం వేసింది. పిపిపి విధానంలో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపడితే ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నామమాత్రపు ఫీజుకు పొందాల్సిన సీట్లకు సైతం రూ.లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. దీంతో సామాన్య ప్రజానీకం పిల్లలు వైద్యవిద్యకు పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. గత వైసిపి ప్రభుత్వం కొత్తగా నిర్మించిన మెడికల్ కాలేజీలో 42 శాతం సీట్లకు ఫీజులు నిర్ణయించడంతో విద్యార్థులు ఏవిధంగా నష్టపోయారో అందరికీ తెలిసిందే. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే ఏలూరులో నిర్మించిన మెడికల్ కాలేజీ. ఏలూరు మెడికల్ కాలేజీలో 2023లో ప్రారంభమైంది. ఈ కాలేజీకి 150 సీట్లు కేటాయించారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ కాలేజీలో మెడికల్ సీట్లు అన్నీ కన్వీనర్ కోటాలోనే నీట్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. అలాకాకుండా 150 సీట్లలో రాష్ట్ర, ఆలిండియా కోటా కింద 86 సీట్లు కేటాయించి మిగిలిన 64 సీట్లకు ఫీజులు నిర్ణయించారు. బి కేటగిరిలోని 45 సీట్లకు రూ.12 లక్షలు ఫీజు నిర్ణయించగా, సి కేటగిరిలోని 19 సీట్లు ఎన్ఆర్ఐ కోటా కింద రూ.20 లక్షలు ఫీజు నిర్ణయించారు. నిబంధనల ప్రకారం బి కేటగిరిలోని 45 సీట్లు నామమాత్రపు ఫీజుకు కేటాయించాల్సి ఉంటుంది. రూ.12 లక్షలు ఫీజు నిర్ణయించడంతో తక్కువగా లెక్కించినా ఐదేళ్లలో ఫీజు, ఇతర ఖర్చులు కలుపుకుని రూ.75 లక్షలకుపైగా అవుతోంది. సామాన్య ప్రజానీకం తమ పిల్లలను అంత సొమ్ము చెల్లించి ఏవిధంగా చదివించాలో తెలియని పరిస్థితి నెలకొంది.

మార్పు చేస్తామని చెప్పి అంతకంటే దారుణంగా

అప్పట్లో వైసిపి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లకు ఫీజులు నిర్ణయించడాన్ని టిడిపి అగ్రనాయకులు చంద్రబాబు, లోకేష్ సైతం తప్పుబట్టారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే ఆ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పారు. ఇప్పుడు పిపిపి విధానంలో మెడికల్ కాలేజీ నిర్మించేందుకు పూనుకున్నారు. అంటే స్థలంతోపాటు అన్నీ ప్రభుత్వమే ఇచ్చి ప్రయివేటుకు అప్పగిస్తుందన్నమాట. ఈ విధంగా పూర్తి చేసిన కాలేజీలో 50 శాతానికిపైగా సీట్లకు రూ.లక్షల్లో ఫీజులు నిర్ణయిస్తారు. వైసిపి కంటే దారుణంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఐదేళ్లలో దాదాపు రూ.కోటి ఖర్చు చేసి సాధారణ ప్రజానీకం పిల్లలు వైద్యవిద్య ఏవిధంగా చదువుతారో ప్రభుత్వం చెపాల్సి ఉంది. మెడికల్ కాలేజీ ఏర్పాటులో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు..?

ఏలూరు మెడికల్ కాలేజీ తాత్కాలికంగా డిఎంహెచ్ఒ కార్యాలయ ఆవరణలో నిర్మించిన భవనంలో సాగుతోంది. ఏలూరు సర్వజన ఆసుపత్రి ఆవరణలో రూ.535 కోట్లతో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టారు. గడిచిన మూడేళ్లుగా పనులు సాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ పూర్తికాలేదు. ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులకు సర్వజన ఆసుపత్రి ఆవరణలోనే హాస్టల్ సదుపాయం కల్పించారు. ప్రతిరోజూ ఇక్కడ నుంచి మెడికల్ కాలేజీకి బస్సుల్లో వెళ్లాల్సి వస్తోంది. అందుకు ప్రతినెలా రూ.వెయ్యి చొప్పున విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇప్పుడు రూ.1500కు పెంచడంతో విద్యార్థులు నిలదీస్తున్న పరిస్థితి ఉంది. మెడికల్ కాలేజీ ఏర్పాటుపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవలను మరింత విస్తరించాలి
వైద్యులు అందుబాటులో లేకుంటే చర్యలు
మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేదలకు అందిస్తున్న ఎన్‌టిఆర్ ఆరోగ్య వైద్య సేవలు మరింత విస్తరించాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సూచించారు. వైద్యులను ప్రజలు దేవుడిలా భావిస్తారన్నారు. అలాంటి వైద్యులు రోగుల పట్ల సోదరభావంతో పని చేయాలని సూచించారు. నూజివీడు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, సిబ్బందితో మంత్రి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ విధినిర్వహణలో అలసత్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. డ్యూటీ డాక్టర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, ముఖ్యంగా రాత్రిపూట డ్యూటీలో ఎవరూ అందుబాటులో ఉండటం లేదని, సిబ్బంది సరైన సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదులు అందాయని తీరు మార్చుకోపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ విభాగాల సిబ్బంది వివరాలు, వారు చేసే పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఓపీ విభాగాలను పరిశీలించి రోగుల నమోదు, వైద్యుల వద్దకు పంపిణీ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. రక్తనిధి కేంద్రం, సిటీస్కాన్, మలేరియా, దంత విభాగం వంటి అన్నింటి సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అంతా పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. సూచిక బోర్డులు సక్రమంగా లేవని, వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను ఇంటి వాతావరణంలా శుభ్రంగా ఉంచాలని సూచించారు. అవసరమైన అత్యవసర వైద్య పరికరాలు, ఫర్నీచర్ సామగ్రి అవసరం మేరకు మంజూరు చేస్తామన్నారు. సత్వర చికిత్స, దంత చికిత్స, వినికిడి పరీక్షలు, రక్త పరీక్ష, ఎక్స్‌రే, ఇసిజి వంటి విభాగాలను నిరంతరం పరిశీలించాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని మంత్రి ఆదేశించారు. సిబ్బంది అంకితభావంతో పని చేసి, రోగులకు మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పార్థసారధి

రూ.15 వేలు కాదు.. రూ.25 వేలు ఇచ్చి ఆదుకోండి

జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద వచ్చే దసరాకు రూ.15 వేలు ప్రకటించి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తున్నారని జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.గోపీ, చక్రాల అమర్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని ఆటో మోటార్ కార్మికుల సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా అమలు చేసిందని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో క్యాబ్ డ్రైవర్లు తమ ఆదాయంలో 60 శాతానికిపైగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కేవలం రూ.15 వేలు మాత్రమే ఇస్తామని సిఎం ప్రకటించడం సరికాదని, ఎన్నికల హామీల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు (ఆటో, క్యాబ్, లారీ, బస్సు) సంవత్సరానికి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలోని కార్మికుల కుటుంబాలకు భరోసానిచ్చేలా సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేస్తామని, జిఒ నెం.21 రద్దు చేస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వీటన్నింటిపై ఎటువంటి ప్రకటనా చేయకుండా వాహనమిత్ర ద్వారా కేవలం మూడు లక్షల మందికి మాత్రమే వాహనమిత్ర (ఆటో క్యాబ్ ఓనర్లకు) పథకాన్ని ఇస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రవాణా రంగ కార్మికులందరికీ వర్తించేలా సంక్షేమ పథకాలు ప్రకటించాలని, వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, అధిక పెనాల్టీలను వసూలు చేసేలా రూపొందించిన జిఒ నెం.21 వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆటో మోటార్ కార్మికులు అందరినీ సమీకరించి ఈ నెల 18న విజయవాడలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

త్యాగశీలి గారపాటి విమల

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


సంస్మరణ సభలో మాట్లాడుతున్న వై.కేశవరావు, వేదికపై రమాదేవి, ఎ.రవి తదితరులు

తన మరణానంతరం కూడా భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించిన త్యాగశీలి గారపాటి విమల అని రైతుసంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు అన్నారు. గురువారం శనివారపుపేట హేలాపురి లయన్స్ ఆడిటోరియంలో సిపిఎం నాయకులు గారపాటి విమల సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగింది. తొలుత విమల చిత్రపటానికి కేశవరావుతోపాటు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభలో రమాదేవి మాట్లాడుతూ గారపాటి విమల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆమె నిరంతరం ప్రజల్లో అసమానతలు పోవాలని, సమానత్వం రావాలని పరితపించారన్నారు. ఉపాధ్యాయినిగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటాల్లో అగ్రభాగాన నిలిచేవారని గుర్తు చేశారు. రిటైర్‌మెంట్ అనంతరం మహిళా ఉద్యమంలో కీలక పాత్ర పోషించడం ద్వారా ప్రజా జీవితాన్ని కొనసాగించారని, కమ్యూనిస్టుగా ప్రజల తరపున పోరాటాల్లో అగ్రభాగాన నిలిచారని వివరించారు. మహిళా సంఘ జిల్లా కార్యాలయ నిర్మాణంలో విమల పాత్ర మరువలేనిదన్నారు. విశ్రాంతి జీవితాన్ని సైతం ప్రజావసరాలకు ఉపయోగించిన ధన్యజీవి విమల అని కొనియాడారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. రైతుసంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ గారపాటి విమల కుటుంబం యావత్తు ప్రజా ఉద్యమాలతో ముడిపడి ఉందన్నారు. ఏలూరు ఎంఎల్ఎగా పని చేసిన గారపాటి సత్యనారాయణ స్ఫూర్తితో విమల పని చేశారని, బతికుండగా ప్రజా జీవితం గడిపి, మరణానంతరం కూడా ప్రజాసేవకే అంకితం కావాలని భావించి ఆచరించడం కమ్యూనిస్టులకే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో పాతూరి రవి, సిఐటియు సీనియర్ నాయకులు చింతకాయల బాబూరావు, జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నేత గుత్తికొండ కృష్ణారావు, ఐద్వా పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి పి.పూర్ణ, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జివిఎల్.నరసింహారావు, జి.రవికిషోర్, జె.గోపీ తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని సచివాలయ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - ముసునూరు

వాలంటీర్లు చేసే పనులు తమతో చేయిస్తున్నారని, 15 రోజుల్లో తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన బాట పడతామని మండలంలోని సచివాలయ ఉద్యోగులు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన బాట పట్టారు. ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. వాలంటీర్లు చేసే పనులు కూడా తమతో చేయిస్తున్నారని, దీంతో తమ పనులు చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 16 గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


చింతలపూడిలో వినతి అందజేత



నూజివీడు సెంటర్‌లో బ్యానర్లతో ముస్తాబు

సిఐటియు జిల్లా మహాసభకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సిఐటియు 13వ జిల్లా మహాసభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు తెలిపారు. నూజివీడు పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న పివిఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఈ నెల 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు సిఐటియు జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. పట్టణంలో బ్యానర్లు, జెండాలు తోరణాలతో అలంకరించారు. కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలు పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

గూటాలలో డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి - పోలవరం


విచారణలో పాల్గొన్న అధికారులు

తాగునీటి కుళాయిల నుంచి మురుగునీరు వస్తుందని, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా ఉండటం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని పిజిఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదు మేరకు గూటాల సచివాలయంలో జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ ఎం.రాజు, పోలవరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు పల్లి వీర వెంకట రాంబాబు, పులి ఆంజనేయస్వామి మాట్లాడుతూ కుళాయిల్లో మురుగునీరు రావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదన్నారు. పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తేగాని డ్రెయిన్ల పూడిక తీత పనులు చేపట్టలేదని అన్నారు. పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి ఎవరూ సహకరించడం లేదన్నారు. ఫిర్యాదులతో తనను ఇబ్బంది పెడుతున్నారన్నారు. డిఎల్‌పిఒ ఎం.రాజు మాట్లాడుతూ మంచినీటి ట్యాంకు నుండి వచ్చే నీటిని పరీక్షా కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. ఫలితాలొచ్చిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే తర్వాత నివేదిక అందడంతో తాగునీటి ఎటువంటి ఇబ్బందీ లేదని తేలిందన్నారు. పైపులైన్లు పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో గ్రామ సర్పంచి సిరిపురపు ప్రసాద్, ఉప సర్పంచి శ్రీనివాసు, సంబధిత అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు

ఒపిఎస్ అమలు కోరుతూ మహా నిరసనలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మహా నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన సిఐటియు నేతలు జి.రాజు, ఎన్.హనుమాన్లు మాట్లాడుతూ 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం సెప్టెంబర్ 2004కు ముందు నోటిఫై చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


చింతలపూడిలో వినతి అందజేత

చింతలపూడి: 2003 డిఎస్‌సి, ఇతర శాఖల్లో ఒపిఎస్ అమలు కోరుతూ రాష్ట్ర 2003 డిఎస్‌సి సంఘం ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మహా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో 2003 ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. నిరసన అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



నూజివీడులో నినదిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సిఐటియు నేతలు

ఆక్వా రైతులను ఆదుకుంటాం

ఆక్వా ఎక్స్‌పోను ప్రారంభించిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సహకారం అందిస్తున్నాయని, ఆక్వా ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను రొయ్య, చేపల రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆక్వా ఎక్స్‌పోను మూడు రోజులపాటు నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. పెదఅమిరంలో మూడు రోజులపాటు జరిగే ఆక్వా ఎక్స్ ఇండియా ఎగ్జిబిషన్‌ను ఎంఎల్ఎ రామాంజనేయులు గురువారం ప్రారంభించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆక్వా ఎక్స్ ఇండియా ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. అమెరికా విధించిన సుంకం రైతులపై పెనుభారంగా మారిందని, ఇకపై అమెరికా దిగుమతి దారులు 20 శాతం సుంకం భరించే విధంగా ఉందన్నారు. మిగిలిన సుంకం కూడా రాబోయే రోజుల్లో వారే భరించాల్సిందిగా ఉందని గమనిస్తున్నారన్నారు. తొమ్మిదేళ్లుగా ఇటువంటి ఆక్వా ఎక్స్ ఇండియా ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వంద స్టాళ్లకు పైగా ఏర్పాటు చేశారు. అనంతరం ఎంఎల్ఎ అంజిబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆక్వా ఎక్స్ ఇండియా సిఇఒ దంతులూరి వేణు, సంస్థ ఫౌండర్ సమీర్ పాత్ర, తరుణ్ శ్రీధర్, సికె.మూర్తి, జోడల్ ఇస్మాయిల్, వాసుదేవ దత్తు, ఇంట్రాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజరు రాయప్రోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.


పెదఅమిరంలో ఆక్వా ఎక్స్‌పోను ప్రారంభించిన ఎంఎల్ఎ అంజిబాబు

భారీ వర్షం.. ఉప్పొంగిన వాగులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో బుధ వారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గురువారం ఆయా వాగులు ప్రవహించే మార్గాల్లో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రధానంగా మండలంలోని మక్కినవారి గూడెం-టి.నరసాపురం మార్గంలో దుర్గ గుడి వద్ద జలవాగు, బండివారిగూడెం-మక్కినవారిగూడెం గ్రామాల మధ్య ముగ్గురాళ్ల వాగు, అప్పలరాజుగూడెం-మధ్యాహ్నపువారిగూడెం గ్రామాల మధ్య ఎర్రకాల్వ వాగులు భారీ వర్షం కారణంగా పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రధానంగా మక్కినవారిగూడెం నుండి జంగారెడ్డిగూడెం వెళ్లే స్కూల్ బస్సులు, ఆర్‌టిసి బస్సులు సైతం నిలిచిపోయాయి.


పొంగి ప్రవహిస్తున్న ముగ్గురాళ్ల వాగు

రత్నకుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - ఏలూరు



ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పని చేస్తున్న జిఇవి.రత్నకుమార్‌కు డాక్టరేట్ లభించింది. అన్నామలై విశ్వవిద్యాలయంలో పరిశోధన మార్గదర్శకులు డాక్టర్ కె.సెంథిల్‌కుమార్, సహ పరిశోధన మార్గదర్శకులు డాక్టర్ జెవి.రంగబాబు (గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల) మార్గనిర్దేశంలో 'ఎక్స్‌పరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ బిహేవియర్ ఆఫ్ ఎల్-7075 బేస్డ్ ఆక్వా అండ్ వేస్ట్ ఆఫ్‌రైన్‌ఫోర్స్‌మెంట్ హైబ్రిడ్ మెటల్ మ్యాట్రిక్స్ కాంపోజిట్' అనే అంశంపై ఆయన పరిశోధన పూర్తి చేశారు. జిఇవి.రత్న కుమార్‌కు ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ వనమా రాఘవేంద్రరావు, ప్రిన్సిపల్ పి.బాలకృష్ణ ప్రసాద్, కళాశాల వివిధ విభాగాధిపతులు, కళాశాల అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి

విద్యారంగంలో సమస్యలపై 25న విజయవాడలో రణభేరి

వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు



జీలుగుమిల్లి : వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆ నెల 25వ తేదీన విజయవాడలో జరిగే రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు రణభేరికి సంబంధించి గురువారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలల్లో ఉన్న యుటిఎఫ్ ఉపాధ్యాయ సభ్యులకు రణభేరికి సంబంధించి కరపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధేనేతర పనుల నుంచి విముక్తి కలిగించి, ఒత్తిడి లేకుండా పని చేసేలా చూడాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, తదితర సమస్యలపై జరిగే మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండలాధ్యక్షులు ఎం.పోసమ్మ, కార్యవర్గ సభ్యులు చెన్నరావు, భవానీశంకర్, వెంకటేశ్వరావు, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు :ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి.పద్మ కిషోర్, రాంబాబు కోరారు. ఈ మేరకు వారు మండలంలోని రమణక్కపేట, చెక్కపల్లి, గుడిపాడు గ్రామాల్లో ఉన్న వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను గురువారం కలిసి రణభేరి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై వివిధ రకాల ఒత్తిడిలు పెంచి బోధనకు దూరం చేస్తున్నారన్నారు. సిపిఎస్‌ను కద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, విద్యాపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి కార్యక్రమాన్ని సెప్టెంబర్ 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో సెప్టెంబర్ 19వ తేదీన రణభేరి బైక్ ర్యాలీ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముసునూరు మండలం నుం,ఇ పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు పుల్లయ్య, కోశాధికారి నారాయణ, గుడిమెట్ల రాంబాబు, ప్రధానోపాధ్యాయులు అల్లాబక్షు నాగబాబు, సభ్యులు యోగిత అబ్రహం, వరప్రసాద్, మురళీకృష్ణ, బద్దు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం

జెడ్‌పి సిఇఒ శ్రీహరి

ప్రజాశక్తి - ముసునూరు

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ప్రతి గ్రామ పంచాయతీ ఆదాయ వనరులు పెంచుకోవాలని జెడ్‌పి సిఇఒ శ్రీహరి అన్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం డోర్‌టుడోర్ చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి ఆరబెట్టాలని, అనంతరం సిబ్బంది సహకారంతో కంపోస్టు ఎరువును తయారుచేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని అవగాహన కల్పించారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా స్లీవ్‌జోజి


స్లీవ్‌జోజి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి తహ శీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలను కె.స్లీవ్‌జోజి స్వీకరించారు. ప్రస్తుతం ఆయన జంగారెడ్డిగూడెం తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చింతలపూడి తహశీల్దార్ సెలవులో ఉండడంతో ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

అవసరం మేరకు యూరియా సరఫరా చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

రైతులకు షాప్ యజమానులు ఒక బస్తా యూరియా మాత్రమే ఇచ్చి సరిపెడుతున్నారని సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు అన్నారు. మండలంలో యూరియా కొరత లేదని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పడం సరికాదన్నారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని గ్రోమోర్‌లో క్యూ లైన్‌లో ఉన్న రైతులకు ఎన్ని ఎకరాలు ఉన్నా ఒక పట్టాదార్ పాస్ పుస్తకానికి ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారన్నారు. ఎక్కువ భూమి ఉన్న రైతుల పరిస్థితి ఏంటని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణం యూరియా కొరతను నివారించి రైతులకు ఎంత మేరకు అవసరమో అంత యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఇంటర్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి సెక్రటరీ స్టేట్ అల్లైడ్, హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ డిప్లొమా ఇన్ పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏలూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సావిత్రి తెలిపారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ఏలూరు వైద్య కళాశాలలో రూ.వంద రుసుం చెల్లించి వారి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు. దరఖాస్తులను www.apsahpc.co.in వెబ్‌సైట్‌లో లభిస్తాయని తెలిపారు. పారామెడికల్ కోర్సులకు ఇంటర్ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్ బైపిసి, ఎంపిసి చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విజిలెన్సు, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా వివిధ ప్రాంతాల్లో ఏక కాలంలో రెండు బృందాలుగా ఏర్పడి ఎరువుల దుకాణాలు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎఇ జి.మీరయ్య, విజిలెన్స్ ఎస్ఐ సిహెచ్.రంజిత్‌కుమార్, కె.నాగరాజు, కె.సీతారాం, బుట్టాయగూడెం మండల వ్యవసాయాధికారి ప్రియాంక పాల్గొన్నారు.

14న స్త్రీ శక్తి మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కొయ్యలగూడెంలో ఈ నెల 14న జరిగే స్త్రీ శక్తి విజయోత్సవ సభకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విజయోత్సవ సభపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 14న కొయ్యలగూడెంలోని మార్కెటింగ్ యార్డ్‌లో స్త్రీ శక్తి విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందన్నారు. విజయోత్సవ సభకు మండలంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, చింతలపూడి నవీన్, పొట్టారామారావు, తహశీల్దార్ టి.సాయిబాబా, ఎంపిడిఒ నగరాజకుమారి, కొల్లి రమేష్, అద్దంకి జగ్గారావు, మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి, ఎపిఒ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ఈ నెల 14వ తేదీన కొయ్యలగూడెంలో జరగనున్న స్త్రీ శక్తి పథకం నియోజకవర్గ స్థాయి బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ మండలాధ్యక్షులు పి.రాము అధికార యంత్రాంగాన్ని కోరారు. జీలుగుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల వారీగా మహిళలను మొబలైజేషన్ చేసి పెద్ద ఎత్తున సభకు హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన అధికార ప్రతినిధి జి.రవికుమార్, ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్, తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, ఎంపిటిసి సభ్యులు ఎన్.శ్రీను, సర్పంచులు, రెవెన్యూ, వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ బోల్తా : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బండివారిగూడెం సమీపంలో జామాయిల్ పుల్లల లోడు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన లారీ జామాయిల్ పుల్లల లోడుతో మండలంలోని బండివారిగూడెం మీదుగా వెళుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు బండివారిగూడెం సమీపంలో నీటి ప్రవాహానికి రోడ్డు కొట్టుకుపోవడంతో ఏర్పడిన గుంతలో లారీ పడి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయితే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. లారీ బోల్తా పడడంతో వాహనాలు, బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో నాటు సారా తయారీ అమ్మకాలు, నిల్వలపై దాడులు జరిపినట్లు ఏలూరు అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పిడుగుపాటుకు ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

పిడుగు పడి ముగ్గురు గాయాలపాలైన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మెత్తుమెల్లివారిగూడెంలో బుధవారం మేకలు కాయడానికి నలుగురు గిరిజనులు వెళ్లారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో వర్షం పడడంతో చెట్టు కిందకు చేరుకున్నారు. ఆ సమయంలో పిడుగు పడడంతో నలుగురు పది నిమిషాలు స్పృహ కోల్పోయారు. స్థానికులు వారిని యర్రగుంటపల్లి పిహెచ్‌సి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం చింతలపూడి ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మూడు రోజులు ఆసుపత్రిలో ఉండాలని వైద్యులు సూచించగా వానిరి ఇంట్లో ఉన్న ఇబ్బందుల రీత్యా ఇంటికి వెళ్లిపోయారు. తమకు సహాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

జెడ్‌పి చైర్‌పర్సన్‌ను కలిసిన రమేష్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమేష్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్‌ను జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ రాజ్ విభాగం ద్వారా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. పనుల నాణ్యత, వేగం, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధిలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని చైర్‌పర్సన్ సూచించారు.

13న పాతూరి వెంకటేశ్వరరావు వర్థంతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఈ నెల 13న మండల కేంద్రమైన ఆగిరిపల్లిలోని సుందరయ్య నిలయంలో సిపిఎం నూజివీడు డివిజన్ కార్యదర్శి, అమరజీవి కామ్రేడ్ పాతూరి వెంకటేశ్వరరావు 19వ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎంతో పలు ప్రజాసంఘాలకు చెందిన వారు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

రూ.25 లక్షల విలువైన వృక్షాలకు వేలం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులోని కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గుర్తించిన స్థలంలో రూ.25 లక్షలకు పైగా విలువైన వృక్షాలకు ఈ నెల 24వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు స్థలంలో 52 టేకు వృక్షాలు, 82 కొబ్బరి చెట్లు, ఐదు వేప చెట్లు ఉన్నాయని, ఆసక్తి గల వ్యక్తులు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వేలానికి సంబంధించిన వివరాలు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఎలిమెంటరీ స్కూల్ తనిఖీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాలను ఎంఇఒ ఎస్.జమలయ్య గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, ఆవరణలో పరిశుభ్రత, పాఠ్యాంశాల బోధనల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం అందించడంలో అలసత్వం వహించవద్దని సూచించారు. నూరు శాతం హాజరుతో విద్యా బోధన కొనసాగి ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు బోధించారు.

'గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం'

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ప్రొద్దువాక, దేవపూడి, వణుదుర్రు గ్రామాల్లో నరేగా నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి నూరు శాతం అంతర్గత రోడ్లు పూర్తి చేస్తానన్నారు. ప్రధాన రహదారులను అభివృద్ధి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శిగా నీరజ సుధాకర్

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శిగా చింతలపూడి జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజ సుధాకర్‌ను వైసిపి అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

ఉపాధ్యాయులను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - ముదినేపల్లి

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదిన్నర గడిచినప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయుల విషయంలో ఏ మాత్రం సానుకూల దృక్పథం లేకపోవటం తీవ్ర నిరాశకు గురి చేసిందని మండలాధ్యక్షులు కృపాకర్ తెలిపారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ముదినేపల్లి మండలవ్యాప్తంగా గురువారం నల్ల రిబ్బన్లతో నిరసనతో పాటు పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. నాలుగు డిఎలు రావాల్సి ఉందని, సిపిఎస్ రద్దు చేస్తామని డిప్యూటీ సిఎం స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకొచ్చిన వెంటనే పిఆర్‌సి అమలు చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయన్నారు. వేలాది మంది నూతన పిఆర్‌సి తీసుకోకుండానే ఉద్యోగ విరమణ చేస్తున్నారని, ఆర్థికంగా తీవ్రంగా నష్టోతున్నారని వాపోయారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'మానవత' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న మానవత సభ్యులు

ప్రజాశక్తి - భీమడోలు

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమడోలు శాఖ ఆధ్వర్యంలో సూరప్పగూడెంలో గురువారం రెండు కార్యక్రమాలు చేపట్టినట్లు సంస్థ ఆత్మీయ సహకార విభాగం, జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు తెలిపారు. దీనిలో భాగంగా ఇటీవల కాలంలో కుటుంబ పెద్ద చనిపోయిన కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు, వంట సామగ్రి, దుస్తులు, ఇతరాలను భీమడోలు శాఖ అధ్యక్షులు ఎ.ప్రసాదరావు ఆధ్వర్యంలో మానవత సభ్యులు అందించారన్నారు. సంస్థ సభ్యులు వంగా గంగరాజు చనిపోయిన నేపథ్యంలో గంగాధరరావుతో పాటు శాఖ ఇతర సభ్యులు వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట రమణ శంకర్, పసుపులేటి సాంబశివరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం లక్ష్మీదుర్గకు అభినందన

ప్రజాశక్తి - భీమడోలు


బోధనాకృతం ప్రదర్శిస్తున్న హెచ్‌ఎం విద్యార్థులు

పోలసానిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-2లో విద్యార్థులకు బోధనలో నిర్వహించే వివిధ కృత్యాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. ఈ మేరకు కార్యక్రమాలను నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మీదుర్గను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా పోలసానిపల్లి గ్రామ సర్పంచి దంపతులు షేక్ రహీమాబేగం, షేక్ హసేనా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చూపిన చొరవ కారణంగా పోలసానిపల్లి పాఠశాల రాష్ట్రస్థాయిలో పలువురి దృష్టిలో పడిందని, ఇతరులకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని వారు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు తాము విద్యార్థులకు బోధించే వివిధ కృత్యాలను, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల స్థాయిలో బోధించే పలు అంశాలను సామాజిక మాధ్యమంలో పెడుతున్నారు. ఇదే క్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు బోధించిన పలు కృత్యాలను సామాజిక మాధ్యమంలో ప్రదర్శించగా, వీటిని సమగ్ర శిక్షతోపాటు, రాష్ట్ర విద్యాశాఖ తిలకించింది. వాటిలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలితో తయారుచేసిన పలు కృత్యాలను గుర్తించి ఆయా శాఖల ద్వారా నిర్వహించే సామాజిక మాధ్యమంలో రాష్ట్రస్థాయిలో ప్రదర్శన కోసం ఉంచారు. సదరు శాఖల వారు నేరుగా చరవాణిలో అభినందించారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని గ్రామ సర్పంచితో పాటు, మండల విద్యాధికారులు భాస్కర్‌కుమార్, శ్రీనివాసరావు, ఎంపిడిఒ పద్మావతి దేవి అభినందించారు.

ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖాధికారులు

ప్రజాశక్తి - పోలవరం

జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పరస్కరించుకుని విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ రేంజర్ ఎస్‌కె.వలి ఆధ్వర్యంలో పోలవరంలోని అటవీ శాఖ కార్యాలయం వద్ద నివాళులర్పించారు. అనంతరం అటవీ శాఖ కార్యాలయం నుంచి ఏటిగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖాధికారి వలి మాట్లాడుతూ అటవీ శాఖలో ఉద్యోగం చేస్తూ విధి నిర్వహణలో అమరులైన వారి త్యాగాలను, సేవలను, గుర్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 11న అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖాధికారులు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సూరిబాబు, మీనాక్షి, గోపీకుమార్, ఎఫ్ఎస్ఒ సోమరాజు, పరమేశ్వరరావు, బాబూరావు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు వెంకటలక్ష్మి పరామర్శ

ప్రజాశక్తి - దెందులూరు


బాధితులను పరామర్శిస్తున్న ఘంటసాల వెంకటలక్ష్మి

గుమ్మలపాడు గ్రామంలో ప్రమాదానికి గురైనవారిని రాష్ట్ర వడ్డీ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి గురువారం పరామర్శించారు. గ్రామ ప్రజలతో, గ్రామ పెద్దలతో మాట్లాడి ప్రమాద సంఘటన విషయాలను, గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా ఎంఎల్ఎతో, కలెక్టర్‌తో మాట్లాడి వారికి అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు. కొల్లేరు గ్రామ ప్రజలు జీవనోపాధి లేక బతుకు తెరువుకోసం వలసలు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. కైకలూరు నియోజకవర్గం గుమ్మలపాడు గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రంలో జనగామ గ్రామానికి చేపల చెరువుల పట్టుబడి కోసం వెళ్లిన కూలీలు ప్రమాదవశాత్తు వ్యాన్ బోల్తా పడి 20 మంది ప్రమాదానికి గురయ్యారన్నారు. అందులో ఒకరు మరణించారని, ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మిగతావారు గాయాలపాలయ్యారని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రయివేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేక సొంత గ్రామంలోనే ఇంటి వద్దనే ఆర్ఎంపి డాక్టర్లతో వైద్యం చేయించుకుంటున్నారని ఆమె తెలిపారు.

విద్యారంగంలో సమస్యలపై పోరాడాలి : ఎఐఎస్‌ఎఫ్

చింతలపూడి :విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్, కోశాధికారి ఎం.క్రాంతికుమార్ అన్నారు. చింతలపూడిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఐఎస్‌ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఉద్దేశించి శివకుమార్, క్రాంతికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐఎస్‌ఎఫ్ తొలి నుంచి సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. నూతన కమిటీని అభినందించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

మాజీ ఎంఎల్‌ఎ ప్రతాప్ వ్యాఖ్యలపై తెలుగు తమ్ముళ్ల స్పందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అభివృద్ధి, సంక్షేమంపై ఎప్పుడైనా, ఎక్కడైనా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామంటూ తెలుగు తమ్ముళ్లు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావుకు సవాల్ విసిరారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి తెలుగు తమ్ముళ్లు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు యనమదల వాసు, సర్పంచి నరసింహారావు మాట్లాడుతూ కూటమి పాలనపై లేనిపోని అవాకులు చవాకులు పేలడం సరికాదన్నారు. ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గడిచిన రెండు మూడు రోజులుగా మాజీ ఎంఎల్ఎ ప్రతాప్ అండ్ కో కూటమి పాలనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగానే నాంది పలికినట్లు చెప్పారు. డయాలసిస్ సెంటర్‌ను కూడా టిడిపి హయాంలోనే తెచ్చామన్నారు. వైద్య సేవల నిమిత్తం రూ.ఆరు కోట్లు, ఎన్‌ఒసికి మరో రూ.రెండు కోట్లు మంత్రి పార్థసారథి మంజూరు చేయించినట్లు చెప్పారు. వెంకట ప్రతాప్ అప్పారావు ఎంఎల్‌ఎగా ఉన్న సమయంలో నాగార్జునసాగర్ జలాలకు సంబంధించి తెలంగాణలో గండి పడితే అటువైపు దృష్టి సారించలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఆలయ చైర్‌పర్సన్‌గా శ్యామలరావు

ముసునూరు :బలివే శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్‌పర్సన్‌గా బొమ్మకంటి శ్యామలరావు నియమితులయ్యారు. మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన బొమ్మకంటి శ్యామలరావు గతంలో 15 ఏళ్ల పాటు పంచాయతీ సర్పంచిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి పలు సేవలందించారు. శ్యామలరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పాటు పడుతూ, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని చెప్పారు.